# వెయ్యిన్నొక్క ప్రేమలేఖలు

త్రిలింగప్రభ దిన పత్రిక తాలూకు ఓ ఆదివారం నాటి సంచికలో అడ్వర్టయిజ్మెంట్ ఒకటి ఈ క్రింది విధంగా పడింది.'' ఈ నెల 19 వ తేదీ రాత్రి గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో నేను హైదరాబాదునుంచి ఏలూరు ప్రయాణం చేసిన సందర్భంలో పన్నెండు ప్రేమలేఖలున్న కవరు ఒకటి నాకు తెలియకుండా నాకోటు జేబులోకి చేరింది. ఇది ప్రమాదవశాత్తూ జరిగిందనే భావిస్తున్నాను పచ్చని నా సంసారంలో పూర్వపు సుఖశాంతుల స్థితి యదాతథంగా కొనసాగాలంటే ఈ కవరు యజమాని వచ్చి నాదగ్గర్నుంచి వెంటనే ఈవకరును తీసికొని వెళ్ళటం అవసరం. కోరే యెడల దారి ఖర్చులు ముట్టచెప్పగలను! నాపేరు కూడా శంకరమే అయివుండటం బహుశా ఈ ప్రమాదానికి కారణమయివుండవచ్చు

శంకరం

స్టేట్ బాంక్, ఏలూరు-1''

ఈ రకం అడ్వర్టైజ్మెంటు అరుదుకావటాన, దీన్ని చదివినవాళ్లకు ఆశ్చర్యం కలిగి ఉండవచ్చు. కాగా దీని పూర్వరంగం కథనూ, శంకరంలో సుళ్లు తిరుగుతున్న హృదయ క్షోభనూ తెలిసిన వాళ్ళెవరూ ఆశ్చర్యపడరు.

* * *

హైదరాబాదు నుంచి అర్థరాత్రి ప్రయాణం చేసి వచ్చిన కారాణాన నిద్రతో కళ్ళు తేలిపోతూండగా ఇంట్లో అడుగు పెట్టాడు శంకరం. హడావుడిగా నీళ్ళు పోసేసుకుని, అదరాబాదరా నాలుగు మెతుకులునోట్లో వేసేసుకుని మంచం మీద అడ్డంగా పడిపోయి మరునిముషంలో నిద్రలోకి జారిపోయాడు.

అతగాడి అర్థాంగి లీల. సర్ఫ్‌లో పెడదామని అతను విడిచిన కోటూ, పాంటూ అందుకుని డబ్బు తీద్దామని కోటు జేబులో చెయ్యి పెట్టింది. డబ్బుకు బదులు ఒక లావుపాటి కవరు చేతికి దొరికింది. కాగితాలూ, కవరూ తనకనవసరమైన విషయాలని అనుకొంటూనే, కుతూహలం తన్నుకొచ్చిన కారణంగా కవర్లోని కాగితాలను బయటకు తీసింది. రంగురంగుల కాగితాల మీద రాయబడిన ఉత్తరాలు చూసి కుతూహలం పెరిగి, కుర్చీలో కూలబడి తీరుబడిగా వాటిని చదవటం మొదలు పెట్టింది లీల.

రెండు మూడు కాగితాలు చదివేసరికి ఆమె శ్వాస బిగిసిపోయింది. ఆమె మనస్సు అయోమయా వస్థలో పడిపోయింది. కారణం ఆ కాగితాలు ప్రేమలేఖలు?- భర్త శంకరానికి ఎవరో ఆడపిల్లలు రాసిన ప్రేమలేఖలు. పరిపరివిధాలుగా వాళ్ళు వెలిబుచ్చుకున్న విరహవేదనలు!!!

ఒక ఉత్తరం ఇల్లా వుంది: '' నా ప్రాణప్రియుని పాదపద్మములకు నేను నమస్కరించి వ్రాసికొను విన్నపములు- ప్రియా, మీరంటే నాకెంత ఇదో మాటల్లో చెప్పలేను. మీతో హైదరాబాద్ పట్టణములో గడిపిన కాలము కొద్దిపాటిదే అయిననూ ఈతీయని స్మృతులు నామనస్సును అల్లకల్లోలము చేయు చున్నవి. నా అణువణువునా మీ రూపం నిండిపోయి ఉంది. ఆ పాండిత్యమూ, ఆ కవిత్వభావాలూ ఏనాటికీ నేను మరువలేను ఆ కాస్త కార్యక్రమమూ పూర్తి కాకుండా హద్దుమీరుట నాకు ఇష్టములేదు'

అని మొన్న మీకు నేను కష్టము కలిగించితినా? .. క్షమించండి.. . ప్రస్తుతం మానాన్నగారు వూళ్ళోనే వున్నారు. అకుచాటు పువ్వును కనుక మీరే వచ్చి మానాన్నగారితో సంప్రదిస్తారని త్వరలో ఆ మూడుముళ్ళ కార్యక్రమం కాస్తా పూర్తాచేయుదురని ఎంతగానో ఆశపడుతూ యున్నాను. జన్మజన్మలకూ రసిక హృదయులైన మీరే నాకు భర్తగా లభించవలయునని ఎడతెగకుండా మీ పాదసేవ చేసుకొనే భాగ్యం నాకు కలగాలని కూడా నేను భగవంతుణ్ణి కోరుతున్నాను.

ఇంతే సంగతులు,

ఇట్లు కాబోయే మీ పాదదాసి,

రామసుబ్బాయమ్మ''

ఆకుపచ్చరంగు ఉత్తరంలో ఇల్లా ఉంది:

'' బిలవెడ్ శంకరంగారూ,

నమస్తే, మనం కలిసినప్పుడల్లా నాకు డబ్బు గుప్పిస్తున్నారు.ఏమీ బాగాలేదు. నేను బాధ్యతలు గలదాననే అనుకోండి. అంతమాత్రాన డబ్బుకు అమ్ముడుపోయేదాన్ననుకున్నారా!ఛ,ఛ! నా లక్ష్యమల్లా మిమ్మల్ని సంతోషపెట్టి, చూసి, సంతోషించటమే... ... ... అన్నట్లు మీకేవేవో టేస్టులున్నాయన్నారు. నేను మీ దాన్నయ్యే భాగ్యం కలిగితే వాటిని తీర్చటానికి నేను మా కుటుంబ సభ్యులందరితోనూ కలిసి తప్పక శాయశక్తులా కృషి చేస్తాను. ప్లీజ్, ప్లీజ్, నన్ను మీ దాన్ని చేసుకోరూ?

ఈ మాటు మనం ఎక్కడ కలవాలో తెలియపరుస్తూ వెంటనే రాస్తారు కదూ! మిమ్మల్ని ఆనందపు ఉయ్యాలల్లో ఓలలాడించే సమయం కోసం ఎదురు చూసే మీ మధుర ప్రేయసి,

శకుంతల

పి.యస్: మీకు పెళ్ళయిందో లేదో నాకు తెలియదు, పెళ్ళి అయినా ఫరవాలేదు. ఎల్లప్పుడూ మిమ్మల్ని సుఖపెడుతూండేందుకు వీలుగా ఏదో ఒక ఒప్పందానికయినా నేను సిద్ధమే.

శకుంతల''

పసుపురంగు ఉత్తరంలో అక్షరాలు ఎరుపులో టైపు చేయబడి ఉన్నాయి.

''హల్లో, ఖర్, డియర్!

త్రీస్ట్రాంగ్ నేషనల్ టైప్ కిసెస్.

... అబ్బ, తలుచుకుని తలుచుకుని రాస్తూంటే ఎల్లా ఉందో తెలాసా? ఒక గోల్కొండ కొట్టేసినంత హాట్‌గా ఉంది.... అన్నట్టు మొన్న కాచిగుడా స్టేషన్‌లో నువ్వడిగింది మన మారేజి గురించికదూ! నాన్సెన్స్ మారేజి ఏమిటి? వాట్ ఇన్ ఏ మారేజ్? యాన్ ఇయర్లీ కారేజ్, ఏ పర్మనెంట్ బాండేజ్, ఎండ్స్ ఇన్ ఏ [illegible] ! హాయ్, డియర్, కలకత్తా నుంచి రావు, రాణీ మొన్న వచ్చేశారు. తెలాసా? ఇంక మనకు పార్టీలకు కొదవేమిటి. కాని, నువ్వు లేకపోతే నాకు థ్రిల్లే కనిపించదు. ఎల్లా? నెక్స్‌ట్ మంత్ సెకండ్ సన్‌డే వచ్చేయ్. అన్నట్టు ఈవెనింగ్ ఇన్ పారిస్, డన్ హిల్ ఓనాలుగు పేకెట్లు తేవటం మాత్రం మర్చిపోకూ! 'గో సమ్మం' ఇక్కడ లాగానే దొరుకుతున్నాయిలే తప్పకుండా వస్తావుకదూ!

సో స్వీట్ ఫీల్ లైక్ ఏ పింక్ ఫేరియో విత్ లాట్స్ ఆఫ్ కిసెస్, ఎంబ్రేసెస్ అండ్ లవ్స్

ప్రేమ

ఈ ఉత్తరాలు చదివి శూన్యంలోకి చూస్తూ వుండిపోయిన లీల, రెండు నిముషాలు గడిచాక గాని ఈ లోకంలోకి రాలేదు. క్రమంగా ఆమె మొహమూ, కళ్ళూ ఎరుపెక్కనారంభించాయి. వరదగా మారిన కోపం ముక్కుపుటాల్లో నుంచి వేడిశ్వాస రూపంలో బయటకు తన్నుకొస్తూండగా ఆమె పడక కుర్చీలోంచి ఛివాల్న లేచింది. వుత్తరాలన్నీ పోగుచేసి పట్టుకొని మంచం దగ్గరకు వెళ్ళింది. శంకరం గాఢనిద్రలో వున్నాడు. లీల అతని భుజంమీద చెయ్యి వేసి ఒక్క కుదుపు కుదిపింది. మళ్ళీ మళ్ళీ కుదిపింది. నాలుగోసారికి గాబరా పడుతూ లేచి కూర్చున్నాడు శంకరం. ఉత్తరాల కట్టను అతని మొహం మీదకు పట్టుకొని అధికార స్వరంతో అడిగింది లీల.

"ఈ ఉత్తరాలన్నీ ఏమిటండీ?" శంకరం అరమూత కళ్ళతో 'ఊఁ' అని మళ్ళీ పడుకోబోయాడు. లీల అతన్ని ముందుకు తోసింది. "మిమ్మల్నే, ఈ కట్టంతా ఏమిటి?" శంకరం కొంచెం తెలివిన పడ్డాడు. అయినా కళ్ళు మూసుకొని ఉండే అన్నాడు "నాకేం తెలీదు" మళ్ళీ పడుకోబోయాడు. మళ్ళీ అతన్ని ఓ తోపు తోసింది లీల. "తెలీదుట, తెలీదు. సిగ్గులేకపోతే సరి!..తెలీకడుగుతాను, ఎన్నాళ్ళనుంచి ఈ రంకు భాగోతం" లీల అఖరు మాటను ఒత్తి పలకటంతో శంకరం మత్తుహరాత్తుగా ఎగిరి పోయింది. మంచంమీద తిన్నగా కూర్చుంటూ , కళ్ళు పూర్తిగా తెరిచి అడిగాడు అతను : "రంకు భాగోతమా?" ... "లేకపోతే సావిత్రి నాటకమా?.. ఒకటి రెండూ కాదు పాతిక ఉత్తరాలు! మీరు హైదరాబాదు వెళ్ళి చేసుకొచ్చిన ఆఫీసు పని ఇదన్నమాట... అసలు మీరు కాంపు వెళ్ళినప్పుడల్లా చేస్తున్నది ఇదేనా?... నలభైఐదేళ్ళు వచ్చాయి బతుక్కి. మీకిదేం పోయేకాలం?... పోనీ భ్రమ చావలేదనుకో, బంగారం లాంటి మనిషిని ఇంట్లో నేనుండగా ఆ అడ్డమైన వూడ్పుగత్తెల్తోటి సరసాలాడ్డానికి మీకు అసహ్యంలేదా? ఛీ,ఛీ, ఎంగిలి బతుకు!"

కోపంతో ఎగిరెగిరి పడుతూ చేత్తో శంకరం బుగ్గలను పొడుస్తూ లీల అన్న ఈమాటలకు శంకరానికి మత్తు పూర్తిగా ఎగిరిపోయింది. అయోమయపు ముఖంతో శంకరం అన్నాడు: "ఉత్తరాలా? ఊడ్పుకత్తెలా? సరసమా ... ఏమిటే నువ్వంటున్నది?... వివరంగా ఏడు."

"అదుగో, ఆ నాటకమే ఆడొద్దంటున్నాను. ఈ ఉత్తరాలన్నీ మీకు వచ్చినవి కావూ? నేనంటే ఇష్టంలేకపోతే ఆ ఏడుపేదో ఏడవండి. ఎవరి మంచం వాళ్ళది, ఎవరి కంచం వాళ్ళది. అంతేకాని ఆ ఏబ్రాసి ముండ నెవత్తినో తెచ్చి నా నెత్తిన పెట్టి సంసారం చెయ్యమంటే నేను ఛస్తే చెయ్యను. చెయ్యటమేమిటి. దాన్నినూతిలోకి తోసి నేను పడతాను."

శంకరం లేచి ముందుకు అడుగువేసి లీల చేతిలోనుంచి వుత్తరాల బొత్తిని తీసుకున్నాడు. "ఈ కాగితాల్ని నేనెప్పుడూ చూడలేదే, నాకెప్పుడొచ్చాయబ్బా!" అన్నాడు.

"అప్పుడే మర్చిపోయారా? మీరు ప్రేమించిన సుందరాంగులు హైదరాబాదులో ఎవడో బ్రోకరు ద్వారా మీకు అందించినప్పుడు వచ్చాయి. జ్ఞాపకచిహ్నాలుగా వాటిని మీరు కోటు జేబులో పెట్టుకొని మోసుకొస్తే వచ్చాయి. చాలా?"

"ఈ వయస్సులో నాకు ప్రేమేమిటే నా శ్రాద్ధం! మూడోవాడు నీ కడుపులో పడ్డప్పుడే కాళ్ళు నొప్పులన్నావు. నడుం నొప్పన్నావు. ప్రేమించటం ఇంక నావల్లకాదు బాబూ - అన్నావు. అప్పట్నుంచే మొదలైంది నాలో ఆ ప్రేమతడి అనేది ఇంకిపోవటం. ఇప్పటికింకా మిగిలి ఉందంటావా?.. ముందు

ఇవ్వేమిటో చూడనీ,"

తోక తొక్కిన తాచులా లీల కస్సుమంది, " ఆఁ అదుగో, ఇంకిపోయిందన్నప్పుడే తెలుస్తోంది ఇంటిమీద గాలి రోడ్డు మీదికి మళ్ళిందని కనకనే ఈ గాలి తిరుగుళ్ళు ఉత్తరాల్లో రెపరెపలూను, ఉత్తరాల్లోనే అంత రెపరెపలయితే మనిషి ఎదట ఇంకెంతెంత సరసాలో చూస్తాను చూస్తాను. నేను బతికుండగా ఈ గుమ్మంలోకి ఎవత్తె అడుగు పెడుతుందో చూస్తాను."

శంకరం మొహంలో చిరునవ్వు అదృశ్యమయి అ స్థానాన్ని అసహనం, కోపం ఆక్రమించాయి. అమె మొహం వంక ఒకటి రెండు క్షణాలు పరీక్షగా చూశాడు చూసిచూసి చటుక్కున రెండు చేతుల్తోనూ లీల మెడ పట్టేసి " నోరెత్తావంటే పీక పిసికేస్తాను. జరిగిందేమిటో చెప్పవు. నన్ను తెలుసుకోనీవు. ముందర ఇక్కడ్నుంచి ఫో" అన్నాడు. ఆమెను విడిచి ఉత్తరాల్తో వెళ్ళి గదిలో మంచంమీద కూర్చున్నాడు లీల వంటింట్లోకి వచ్చి కూర్చుంది ఆమెకున్న అంత కోపమూ హఠాత్తుగా దుఃఖంగా మారిపోయింది.అది తెరలు తెరలుగా సన్నసన్నగా బయటికి వస్తోంది. అయితే ఆమె వినిపించీ వినిపించని స్థాయిలో సణుగుడు మాత్రం మానలేదు " చంపేస్తార్ట... చంపేసేయండి .. మగమహారాజులు... మీకేమి... ఎంత మందినయినా తెచ్చి పెట్టుకుంటారు... ఆరడి పెట్టిందన్నపేరు... అయినదానికేగా.... ఉత్తరాలు .. ఏం వుత్తరాలు.... పాండిత్యం చూసి ఒకత్తెట... డబ్బుకోసం ఒకత్తె... సరసం చూసి ఇంకొకత్తె.. కాలుచూసి ఒకతె కన్ను చూసి ఒకత్తె... అవయవానికొకత్తె... తుప్పతల లంజలు .. ఏ కాడుల్లోనో బోడుల్లోనో పుట్టినవాళ్ళు కాకపోతే... ఇట్లా బరితెగిస్తారు?... అయినా, ఇంతమందికీ ఈయనే దొరకాలా?... ఇంతకూ ఒకళ్లనని... ప్రయోజనమేమిటి?.. నా కర్మ ఇలా కాలిపోయింది .. ఈ వయస్సులో ఈయనకీబుద్ధి పుట్టింది. ఈయనిట్లా మారిపోతారని మానాన్నకు ఏమాత్రం తెలిసినా.. ఈయనకు... నన్నసలు కట్టబెట్టేవాడే వాడుగద!.. ఛీ, వెధవ బతుకు. పడిచద్దామంటే నూతిలో నీళ్లయినా లేవు. ఏం చెయ్యను భగవంతుడా... ఓరి నాయనో... ఓరి దేవుడో..."

గదిలో శంకరానికివ్వేమి చెవికెక్కటం లేదు. మొదటి ఉత్తరం పూర్తిచేసి ఆ రసాస్వాదన తాలూకు అనుభూతితో చిరునవ్వులు చిందించుకుంటూ రెండో ఉత్తరంలో పడ్డాడు. హఠాత్తుగా వంటింటి తలుపుమీద టకటక శబ్దమయింది. లీల లేచి తలుపుతీసింది. ఆ వచ్చింది పక్కవాటా భ్రమరాంబ. భ్రమరాంబ కంగారుగా అన్నది. " మీ వాళ్లంతా కులాసాయేనా?" అంత దుఃఖంలోను లీల నివ్వెరపోయి చూసింది. గొంతు సవరించుకొని కళ్ళు తుడుచుకుంది. మరుక్షణంలో చిరాకుగా మొహం పెట్టి అంది.

" అంతా కులాసయేనమ్మా ఎవరికీ ఏమీ రాలేదు. " ... " అమ్మయ్య బతికించారు. ఇందాకట్నుంచీ మీరు ఏడుస్తున్నట్టు వినిపిస్తేనూ ఏమిటో అనుకొని వచ్చాను."

లీల మూతిని మూడు వంకర్లు తిప్పి " రావటం అయిందిగా, ఇహ వెళ్ళండి" అంటూ తలుపులు వెయ్యబోయింది. " వెళ్తాలేవమ్మా! నువ్వు వుండమంటే మాత్రం వుంటానా ఏమిటి? ఇది మీ మొగుడూ పెళ్లాల మధ్యన సరసమని తెలిస్తే అసలు వచ్చేదాన్నే కాదు. ఉష్ ఉష్" భ్రమరాంబ వెళ్ళిపోయింది

లీలలేచి వెళ్ళి మంచినీళ్లుతాగి ఇల్లా వచ్చి కూర్చుందో లేదో అవతలిపక్కవీధి తలుపు చప్పుడయింది. "ఎవరూ?" అడిగింది. లీల " నేనండీ పక్కవీధి వనజాక్షిని." లీల వెళ్ళి తలుపు తీసింది. వనజాక్షి అంది " అవునండి అక్కగారూ, మీకేవో లవ్ లెటర్స్ కవరొచ్చిందిటగా , నిజమేనా?"

లీల తెల్లబోయింది "మీకెవరు చెప్పారు" ... "కరణం గారమ్మాయి చెప్పింది ఇందాకన మీ ఇంట్లోకి రాబోయి విషయం విని వెనక్కొచ్చి నాకు చెప్పింది . నాకు తెలుసండీ వాడే, ఆ స్టూడెంటు సుబ్బారావే రాసుంటాడు. ఇట్లాంటి వెధవ పన్లకు ఈ పేటలో వాడికి పెట్టింది వేరు. పోయే కాలం కాకపోతే పెద్దవారు మీకుటండివాడు రాసేది... ఇంతకీ మీ జాగ్రత్తలో మీరుండటం మంచిదమ్మా.. వాయిల్ చీరెలు, రూబి జాకెట్లు, కుచ్చీ లంగాలూ మానేయ్యండి. పందల పాక చీరలూ, కంట్రోలు ముక్కలూ కట్టుకోండమ్మా. లక్మె పొడరులాంటివి కూడా మంచివి కావు ఏమిటో, మీలాంటి వాళ్ళకే జరిగితే ఇక మాలాంటి వాళ్ళకు వేరే గతేమిటి చెప్పండి. వస్తానండి మరి" వనజాక్షి వెళ్ళిపోయింది.

లీల మనసు అయోమయమైపోయింది. సుబ్బారావెవడో, లవ్ లెటర్సేమిటో, పెళ్ళి కాకుండానే ముదిరిపోయిన వనజాక్షి ఆరిందాలాగా వచ్చి తనకు సలహా ఇవ్వటమేమిటో ఇవేమీ అర్థంకాని కల్లోలంతో ఆమె మనస్సు నిండిపోయింది.

నాలుగయిదు నిముషాలు గడిచాయి. దొడ్లోకి వెళ్ళి వంటగిన్నెలు వేసింది.

ఇంతలో వాకిట్లోనుంచి "అమ్మా" అన్న కేక విని తలెత్తి చూసింది లీల. పోస్టుమాన్. ఆమె హడావుడిగా వాకిట్లోకి వచ్చింది.

పోస్టుమాన్ అన్నాడు। "అమ్మా, తవరు క్షమించాలి. కరణంగారింట్లో ఆయమ్మగారు ఎవురితోనో అంటుంటే ఇన్నాను. ఇందాకని తవరికి నేనిచ్చిన కవరు తవర్దికాదమ్మా, పొరపాటుగా ఇచ్చేశాను. ఉప్పుడిచ్చెయ్యండమ్మా."

"ఏ కవరు. నాకెప్పుడిచ్చేవూ ?"... "అదేనండి, సుబ్బారావుగారు రాసిందండి.... లెటరండి హిః హిః.... తవరు చూసే వుంటారు... లవ్‌లెటరండి. అది తవర్దికాదండి..... పొరపాటుగా మీకిచ్చేసాను."

"లవ్ లెటరేమిటి, నాకివ్వటమేమిటి, నీకు బుర్రా బుద్ధీ వున్నాయా?" ... "తవరికివ్వలేదాండి?... ఏందో, అప్పుడప్పుడు గాపకం సచ్చిపోద్ది" తల గోక్కున్నాడు పోస్టుమాన్. "ఎవురి కిచ్చేసానబ్బా: సర్లెండి. క్షమించండమ్మగారు, ఎల్లొస్తాను."

"ఫుండాకోర్, నాకు లవ్ లెటరేమిటి? నేను ఎవర్ననుకున్నావు? నీ ఉద్యోగం ఇదేనా?" అందామనుకుంది లీల. కాని అప్పటికే వాడు వీధిలోకి వెళ్ళిపోయాడు. ఆమె వీధి తలుపులు గడియ పెట్టింది. హాల్లోకొచ్చి రేడియో స్విచ్చి వేసింది. సిలోన్ స్టేషన్లోంచి ఝూమ్మని తన్నుకొచ్చింది పాట. 'రాశాను ప్రేమలేఖ లెన్నో. వేశాను ఆశలన్ని నీపై లల...' ... "దీని మోహం ఈడ్చ, దీనికీ అదే గోలా?" అనుకుంటూ టక్కున రేడియో కట్టేసింది లీల.

ఆమె హాల్లోకొచ్చి లోపలిగది గుమ్మంలో నుంచుని గదిలోకి తొంగి చూసింది. శంకరం నాలుగో ఉత్తరమో అయిదో ఉత్తరమో చదువుతున్నాడు. ముసి ముసి నవ్వుల్తో మొహం విప్పారిపోయి ఉంది. అతన్ని ఆ స్థితిలో చూసిన లీలకు పోయిన కోపమంతా రక్త ప్రవాహ రూపంలో తల్లోకి సర్రున ఎగబాకింది. ఆమె విసురుగా వంటింట్లోకి నడిచింది

రెండు నిముషాల తర్వాత శంకగం లేచి వంటింట్లోకి వచ్చాడు. ఆమె బుజం మీద చెయ్యి వేసి నవ్వుతూ అన్నాడు "ఓసి వెర్రిమొహమా, ఆ ఉత్తరాలు ఎవరో ఎవరికో రాసుకున్నవి. అవి నా జేబులోకి ఎల్లా వచ్చాయో నాకు తెలీదు "

లీల గిరుక్కున వెనక్కు తిరిగింది. "చేసింది చాలక అబద్ధాలు కూడానా, ఛీ వెధవబతుకు. వెళ్ళండి. ఆ బజారు పిల్లల్తోనే కులకండి నేనూ పిల్లలూ మాదోవన మేము పోతాము. గడవదనే భయమేంలేదు." మరుక్షణంలో దుఃఖం మంచుకు రాగా "హుఁ హుఁ" అని ఏడ్చేసింది లీల.

శంకరం పకపకా నవ్వాడు. "ఓసి వంకర మొహమా. నామాట వినవే, ఆ ఉత్తరాలు నావి కావే. కావాలంటే ఏ ఒట్టుపడితే ఆ ఒట్టు వేస్తాను?" - ఆ తరువాత మాటల్లో శంకరం ఓ డజను ఒట్టు వేశాడు. లీల అవన్నీ తీసి గట్టున పారేసింది. వెక్కి వెక్కి ఏడుస్తూ వెళ్ళి గదిలో మంచంమీద పడుకుని ఉండిపోయింది. పర్యవసానంగా, మధ్యాహ్నపు కాఫీ గిన్నె స్టౌ మీదకు ఎక్కలేదు. ఆ రాత్రి కుక్కర్‌లోకి బియ్యపు గింజలూ పడలేదు. అంతేకాదు, ఆ రాత్రి గదిలోని డబుల్‌కాట్ మంచం రెండు సింగిల్ మంచాలుగా చీలిపోయింది. ఒక భాగం వచ్చి హాల్లో పిల్లల మంచాల మధ్య పడింది. దానిమీద రెండు మగ దిండ్లు పడ్డాయి. మరి కొంచెంసేపటికి ఒక మగ దుప్పటి వాటిని కప్పేసింది. కొన్ని నిముషాల తర్వాత అందులో నుంచి మగ శ్వాస బయటికి వస్తోంది.

★ ★ ★

మర్నాడు - వుడికీ వుడకని మెతుకుల్ని తినీతిననట్టుగా తిని ఆదరాబాదరా శంకరం ఆఫీసుకు వెళ్ళగానే గుమ్మంలో నుంచుని అతగాణ్ణి మొదటగా పలకరించిన వాడు, అతనితోటి వుద్యోగి పద్మనాభం.

"మొహం పీక్కుపోయింది. రాత్రి చారుగాని కాస్త ఎక్కువ తాగేవేమిటొయ్?"... "చారేం ఖర్మ, టాబ్లెట్ వేసుకున్నట్టుగా వుంది పరిస్థితి."... "అరెరే అంతకష్టం ఏమొచ్చిందోయ్, పద పద రెండు అరటేసుకొద్దాం?" ఇద్దరూ కాంటీన్‌కు నడిచారు, కాఫీ తాగారు. శంకరం విషయాన్ని పద్మనాభానికి వివరించాడు. ఆఖర్న అన్నాడు. "ఆ ప్రేమలేఖ కవరు నా కోటు జేబులోకి ఎల్లా వచ్చిందో ఇప్పటికీ నాకర్థం కాలేదోయ్ పద్మ. బహుశా, రైల్లో నేను లెట్రిన్‌లోకి వెళ్ళినప్పుడు నాపక్క బెర్తులో వాడెవడో పొరపాటున వాడి కవర్ను భద్రంగా ఇంటికి మోసుకొచ్చి ఉండవచ్చు. ఆ ఉత్తరాల మీది పేరు నాది కాదు మొర్రో అని ఎంత గోలకెత్తినా మా ఆవిడ వినిపించుకోవటం లేదు ... ప్చ్... ఎట్లా చచ్చేదోయ్?"

పద్మనాభం సిగరెట్టు ఒకటి అంటించాడు. మెడనోమాటు అటూ ఇటూ తిప్పి, పైకోమాటు చూసి, కాలరు పైకి లాక్కొని, రెండుసార్లు గొంతు సవరించుకొని, ఒక నిముషం ఆగి అన్నాడు-"అఁ తగిలింది ఐడియా? చూడు శంకరం, నువ్వు ఆఫీసులోనే వుండు. మీ ఆవిడకు బహుశా నేను గుర్తుండి వుంటాను. నేను ఇప్పుడే మీ ఇంటికి వెడతాను. మీ ఆవిడతో 'అమ్మా. మీ వారూ నేనూ కలిసి మొన్న రైల్లో ప్రయాణం చేశాము. పొరపాటున నా కవరొకటి మీ శ్రీవారి కోటు జేబులో పడిపోయింది. దయచేసి ఇచ్చెయ్యండి,' అని అంటాను. ఆ కవరు తీసుకొచ్చేస్తాను. దాంతో వ్యవహారం ఫైసలైపోతుంది..... అయితే, నేను నిన్ను మళ్ళీ కలుసుకోవటం మాత్రం రేపే. 'కల్పన'లో మంచి మాట్నీ వుంది అందుకని, ఏజంటుకు టికెట్ బిటరిచ్చాన్లే."

శంకరం కళ్ళు మెరిసాయి. "ఓహో, ఏమయిడియా?..... నీ బొడ్లో వున్నది పద్మం కాదు, ఐడియాలు, నువ్వొక ఐడియా నాభానివి?" అన్నాడు. కొంచెం సేపు తర్వాత ఇద్దరూ విడిపోయారు.

★ ★ ★

మర్నాడు ఆఫీసు టైముకు కాంటీన్ గుమ్మంలో నిలబడున్నాడు పద్మనాభం, యధాప్రకారంగా దిగులు కారుతున్న ముఖంతో శంకరం వచ్చి సైకిల్ దిగాడు.

"మన ప్లాన్ బ్రహ్మాండంగా సక్సెస్సయింది కదూ శంకరం? ఇదుగో కవరు" అన్నాడు పద్మనాభం.

శంకరం బాధగా మొహం పెట్టాడు. "ఏం పని చేశావోయ్, కొండమంగలి పని. పరిస్థితి ఇంకా విషమించింది. మా ఆవిడ పుట్టింటికి వెళ్ళటానికి బట్టలు సర్దేస్తోంది. నువ్వు తెచ్చిన కవర్లో ఉన్నది నా పాలసీ, చూడు."

పద్మనాభం గబగబా జేబులో నుంచి కవరు తీసి చూశాడు. అందులో శంకరం పాలసీ ఉన్నమాట వాస్తవం. ఏమీ మాట్లాడలేక నోరు తెరిచి గుడ్లు అప్పగించి చూస్తూ ఉండిపోయాడు పద్మనాభం.

శంకరం అన్నాడు, మా ఆవిడ నీతో "కవరు టేబిల్ మీద ఉన్నది తీసుకోండి" అని చెప్పి లోపలికి వెళ్ళిందికదా? కుక్కర్ కింద మంట తగ్గించి అది ఇవతల కొచ్చే లోపల హడావుడిగా నువ్వు టేబిల్ మీద ముందర ఉన్న ఈ కవరు తీసుకొచ్చేశావు. అసలు కవరు రేడియోకు పక్కగా అక్కడే ఉండిపోయింది. ఇంకేముంది, సాయంత్రం ఇంటికి వెళ్ళగానే బుసలుకొట్టింది మా ఆవిడ. "మీరు మీ ఫ్రెండూ కలిసి నన్ను మోసం చెయ్యాలని చూస్తారా? ఇంతకన్నా ఉరేసుకుని చావకూడదూ? చేసింది చాలు. నా దోవన నేను పోతున్నాను.' బుసబుసలు, ప్రయాణానికి బట్టలు సర్దేస్తోంది. రేపో ఎల్లుండో బండి ఎక్కేస్తుందిట?"

పద్మనాభం నిశ్చేష్టుడయ్యాడు. "ఎంత పని జరిగిందోయ్?... సరే అయిందేదో అయింది ఇప్పుడేం చెయ్యాలో ఆలోచిద్దాం పద" అన్నాడు.

ఇద్దరూ లోపలికెళ్ళారు. కాఫీ తాగారు, కొంచెం సేపయిన తర్వాత పద్మనాభం అన్నాడు: "అబ్బాయ్, ఇంక మనిద్దరం కలిసి ఏం చేసినా మీ ఆవిడకు నీ మీది అనుమానం పోదు. కనుక నువ్వు చేసేదేదో సిన్సియర్‌గా చెయ్యి. పేపర్లో అడ్వర్టయిజ్‌మెంట్ ఒకటి పడేయ్. అవసరమయితే ఆ కవరు స్వంతదారుకు ఏదో ముట్టచెబుతానని కూడా రాయి. ఇదొక్కటే నీ సతీ తత్పరతను నిరూపించుకొనేందుకు మార్గం."

"సరే" అన్నాడు శంకరం. ఇద్దరూ లేచారు.

★ ★ ★

ఇదీకథ

దీని పర్యవసానమే 'త్రిలింగ ప్రభ' దినపత్రికలో పడిన అడ్వర్టయిజ్‌మెంట్.

★ ★ ★

అడ్వర్టయిజ్‌మెంటు పడిన నాలుగు రోజులకు హైదరాబాదు ముద్రతో శంకరానికి ఒక ఉత్తరం వచ్చింది. "రెండొందలు పంపించండి. మీ కష్టం అతి తేలిగ్గాపోయే ఉపాయం చెబుతాను. నమ్మండి.

పి.యస్.

10-1-220, అబిడ్స్, హైదరాబాదు."

శంకరం హుటాహుటీగా పోష్టాఫీసుకు పరుగెత్తి, రెండొందలకు ఇంకో వంద కలిపి, మొత్తం మూడొందల్నూ టెలిగ్రాం మని ఆర్డరు చేశాడు హైదరాబాదుకు

మూడోనాడు మళ్ళీ ఇంకో ఉత్తరం వచ్చింది

"మీతో కలిసి ఆ రాత్రి ప్రయాణం చేసింది నేనే నేను 'వెయ్యిన్నొక్కటి ప్రేమలేఖలు' అన్న శీర్షికతో ఒక పుస్తకం అచ్చు వెయ్యాలని సంకల్పించాను మెటీరియల్ కోసం మా వూళ్ళోవున్న కాలేజీ కుర్రాళ్ళను రిక్వెష్టు చేస్తే, వాళ్ళు బేళ్ళ కొద్దీ వుత్తరాలను ఇచ్చారు. మరయితే అచ్చుకొట్టటానికి నాదగ్గర డబ్బేది? అందుకని మా వూరు నుంచి తిరిగివస్తూ వాటిలో కొన్నింటిని కవర్లో పెట్టి ఆరాత్రి మీ కోటుజేబులో పెట్టాను. క్షమించండి డబ్బులేక 'వెయ్యిన్నొక్కటి ప్రేమలేఖలు' ప్రచురణ ఆగిపోయే పరిస్థితిలో మీరు మూడొందలు పంపి నన్ను రక్షించారు భగవంతుడు మిమ్మల్నీ, మీ సంసారాన్నీ సుఖశాంతులతో రక్షించుగాక? మీ శ్రీమతి గారికికూడా నా క్షమాపణలు అందజేయండి 'వెయ్యిన్నొక్కటి ప్రేమలేఖలు' అచ్చవగానే ఒక ఉచిత ప్రతిని మీకు పంపగలను

అన్నట్టు మీ దగ్గరున్న ఉత్తరాల కవరును నాకు వెంటనే పంపటం మర్చిపోకండి? దాంతో నాకింకా చాలా పనుంది నమస్తే

పబ్లిషర్ శంకరం,

10-1-220. అబిడ్స్"

శంకరం ఈ ఉత్తరాన్ని భార్యకు చూపించాడు

ఆమె దాన్ని పైనుంచి కిందకీ, కింద నుంచి పైకీ అనేకసార్లు చదువుకొంది. అప్పటికి ఆమెకు భర్త తాలూకు నిజాయితీ మీద నమ్మకం కుదిరింది. పర్యవసానంగా ఆ రాత్రి ఆమె భర్తను తెగ గౌరవించి పారేసింది. "నువ్వు హఠాత్తుగా ఇంత గాఢంగా నన్ను ప్రేమించటం మొదలుపెడితే ఈ వయస్సులో నేను భరించలేనే" అని శంకరం అన్నాకూడా ఆమె వినిపించుకోలేదు.

ఎల్లాగో సందు చేసుకుని శంకరం అన్నాడు. "కథ ఇంకా కంచికి వెళ్ళలేదు. చేసింది చాలక నాకు ఉచిత ప్రతిని కూడా పంపుతాట్ట, చూశావా?"

లీల తన చేతుల్ని అతని మెడచుట్టూ ఇంకా బిగించి గోముగా అంది. "పంపనిద్దురూ? ఎంచక్కా రక రకాల ప్రేమ లేఖల్ని మనిద్దరం కలిసి సర్దాగా చదువుకోవచ్చు."

తెల్లబోయాడు శేఖరం.

ఇంకా, ఇల్లా అనుకున్నాడు కూడా: " ఈ మాటల ఖరీదు మూడువందల క్యాషూ పది రోజుల వ్యథానా?.... ఆ రాస్కెల్‌ను ఒక పట్టుపట్టకుండా వదలకూడదు:"

(ఆంధ్రజ్యోతి వారపత్రిక 19-11-78)

* * *     * * *     * * *